GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : బుధవారం- డిసెంబర్ 06-2023 పేజీలు : 3

విలేకరులు కావలెను.

డిజిటల్ మీడియాలో అగ్రగ్రామిగా ఉన్న స్పాట్ న్యూస్ స్పీడ్‌గా అందించే టీ-మీడియాలో పనిచేయడానికి , జిల్లా, నియోజక వర్గ, మండల ఇంచార్జీలు , విలేకరులు కావలెను.

Regd. No. 100/20

అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత

కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఆసక్తి కలవారు తమ వివరాలను క్రింది నెంబర్లకు పంపండి

8500515365, 7382990365, 8919710365

## తెలంగాణకు రెండో

# సీఎంగా రేవంత్ రెడ్డి

- 7న ప్రమాణ స్వీకారం
- 9న భారీ భాహిరంగ కృతజ్ఞత సభ
- ఆరు గ్యారంటీల పై సంతకం



**టీ మీడియా, డిసెంబర్ 5,హైదరాబాద్:** తెలంగాణ సీఎం ఎవరన్నది తేలిపోయింది.నరాలు తెగే ఉత్కంఠకు కాంగ్రెస్ తెరదీసింది. ఎట్టకేలకు తెలంగాణ రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రిని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది.టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డినే ఫైనల్ చేస్తూ అధికారికంగా ప్రకటించిన కేసి వేణుగోపాల్.తెలంగాణకు రేవంత్ రెడ్డి రెండో ముఖ్యమంత్రిగా నియామకం అయ్యారు.ఇటీవల వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మెజార్టీ లభించింది. ప్రభుత్వ ఏర్పాటుకు 60 సీట్లు కావాల్సి ఉండగా.. కాంగ్రెస్‌కు ప్రజలు 64 సీట్లు కట్టబెట్టారు. బీఆర్ఎస్‌కు 39 సీట్లు, బీజేపీకి 8, ఎమ్ఐఎమ్‌కు 7, సీపీఐకి 1 స్థానాల్లో అవకాశం ఇచ్చారు.అయితే, ముఖ్యమంత్రి పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ ఉండటంతో అధిష్టానం అందరితో రెండ్రోజుల పాటు సుధీర్ఘ మంతనాలు జరిపి రేవంత్ రెడ్డిని ఫైనల్ చేసింది.అంతేకాదు.. తెలంగాణ డిప్యూటీ సీఎంలుగా భట్టి విక్రమార్క, సీతక్కను ఎంపిక చేశారు. మరోవైపు రేవంత్ రెడ్డి సీఎంగా.. డిసెంబర్ 7వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 7వ తేదీన గురువారం మంచి ముహూర్తం ఉండటంతో పార్టీ ఆ రోజునే ఫైనల్ చేసింది. మరోవైపు రేవంత్ రెడ్డితో పాటు ఎవరెవరు ప్రమాణ స్వీకారం చేస్తారనేది ఆసక్తిగా మారింది.

## 80 మంది ఎమ్మెల్యేలపై

# క్రిమినల్ కేసులు

### వీరిలో 16 మందిపై తెలంగాణ ఉద్యమం కేసులు



**టీ మీడియా, డిసెంబర్ 5,హైదరాబాద్:**

కొత్తగా ఎన్నికైన 80 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో 16 మందిపై తెలంగాణ ఉద్యమం,మోడల్‌ప్రవర్తనానియమావళి ఉల్లంఘనలకుసంబంధించిన కేసులుఉన్నాయి. ఫోరమ్ఫర్గుడ్గవర్నెన్స్ అనేఎన్జీవో సంస్థ ఈవివరాలనువెల్లడించింది.కొత్తగాఎన్నికైన 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 50 మందిపై కేసులు ఉన్నట్లు తెలిపారు. కేసులు ఉన్న నాయకుల్లో 78 శాతం మంది అధికార పార్టీ (కాంగ్రెస్) ఎమ్మెల్యేలు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన 39 మంది ఎమ్మెల్యేలలో 19 మంది (48 శాతం)పై కేసులు ఉన్నాయని ఎన్జీవో తెలిపింది. బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఏడుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ రకంగా బీజేపీలో అత్యధికంగా 87 శాతం ఎమ్మెల్యేలపై కేసులు ఉన్నాయి.ఎంఐఎంకు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేల్లో నలుగురిపై (57 శాతం) కేసులు కూడా ఉన్నాయి. రాజకీయ పార్టీలు నేర చరిత్ర ఉన్న వ్యక్తులకు టిక్కెట్లు ఇవ్వరాదని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, పార్టీలు గెలుపే ప్రమాణంగా తీసుకుంటున్నాయని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం. పద్మనాభ రెడ్డి అన్నారు. గత నెలలో, ఎన్జీవో అభ్యర్థుల నేర చరిత్రను విశ్లేషించింది, నాలుగు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన 226 మంది నామినీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని గుర్తించింది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను ఒక కమిటీ విశ్లేషించి నివేదికను సిద్ధం చేసింది.కాంగ్రెస్‌లోని 118 మంది అభ్యర్థుల్లో 84 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. అత్యధిక క్రిమినల్ కేసులున్న తెలంగాణ నేతల్లో.. టీపీసీసీ చీఫ్.. రేవంత్ రెడ్డి 89 కేసులు ఉన్నాయి. తర్వాత ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన వెడ్మ బొజ్జుపై 52 కేసులు, మంచిర్యాలకు చెందిన కొక్కిరాల ప్రేంసాగర్ రావుపై 32 కేసులు ఉన్నాయి. వీరంతా తాజాగా విజయం సాధించారు. ఇక గోషామహల్ నుంచి రెండోసారి ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే టి.రాజా సింగ్‌పై 89 కేసులున్నాయి.ఇక కరీంనగర్ నుంచి రెండోసారి ఎన్నికైన బీఆర్ఎస్ నేత గంగుల కమలాకర్‌పై 10 కేసులు ఉన్నాయి. గజ్వేల్ నుంచి మళ్లీ ఎన్నికైన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుపై తొమ్మిది కేసులున్నాయి. అలాగే.. సిరిసిల్ల నుంచి రెండోసారి ఎన్నికైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుపై ఎనిమిది కేసులున్నాయి. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీపై ఆరు కేసులు ఉండగా, మరో ముగ్గురిపై ఒక్కో కేసు ఉంది.



# డీకే శివకుమార్‌తో ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ

**టీ మీడియా, డిసెంబర్ 5,హైదరాబాద్:**

తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎవరు ప్రమాణస్వీకారం చేయబోతున్నారని మీడియా అడిగిన ప్రశ్నకు ఉత్తమ్ కుమార్ రెడ్డి 'నో కామెంట్' అంటూ వెళ్లిపోయారు. సీఎం ఎంపిక విషయంపై అధిష్టానంతో చర్చించేందుకు సోమవారం సాయంత్రమే భట్టి విక్రమార్కతో కలిసి ఉత్తమ్ ఢిల్లీ చేరుకున్నారు. మంగళవారం పలువురు సీనియర్ లీడర్లను కలిసినట్లు సమాచారం. కర్ణాటక ఉపముఖ్యమంత్రి, తెలంగాణ ఎన్నికల పరిశీలకుడు డీకే శివకుమార్ తో ఉత్తమ్ మధ్యాహ్నం భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై దాదాపు గంటన్నర పాటు ఇద్దరూ చర్చించారు. మీటింగ్ తర్వాత బయటకు వచ్చిన ఉత్తమ్ కుమార్ రెడ్డిని మీడియా ప్రతినిధులు చుట్టుముట్టారు. దీంతో ఉత్తమ్ క్లుప్తంగా మాట్లాడారు. పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలను హైకమాండ్ కు వివరించినట్లు చెప్పారు. సీఎం ఎంపిక బాధ్యత హైకమాండ్ దేనని, ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో సీఎంగా ఎవరి పేరును ఖరారుచేశారని మీడియా అడగగా.. నో కామెంట్ అంటూ ఉత్తమ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు, ఉత్తమ్ కుమార్ రెడ్డితో భేటీ తర్వాత డీకే శివకుమార్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసానికి బయలుదేరారు. ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ లకు తెలంగాణ ఎమ్మెల్యేల అభిప్రాయాలను వివరించనున్నట్లు సమాచారం.

## తుఫాన్ భాధితులకు..

# 48 గంటల్లో పరిహారం

### సమీక్షాలో సిఎం జగన్



**టి మీడియా, డిసెంబర్ 5,అమరావతి:**

తుపాను బాధిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి శ్రీ వైయస్.జగన్ అధికారులతో సమీక్షించారు. క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ జి సాయి ప్రసాద్, సీసీఎల్‌ఏ సెక్రటరీ ఇంతియాజ్, సీఎంఓ అధికారులతో సీఎం భేటీ అయ్యారు. తుపాను పరిస్థితులపై ఆయన అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నెల్లూరు %--%కావలి మధ్య సగం ల్యాండ్ ఫాల్, సగం సముద్రంలో తుపాను గమనం ఉందని అధికారులు తెలిపారు. చీరాల బాపట్ల మధ్య పయనించి అక్కడ పూర్తిగా తీరం దాటనుందని ముఖ్యమంత్రికి వివరించారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలో తుపాను ప్రభావం ఈ ఉదయం నుంచి క్రమంగా తగ్గుముఖం పడుతోందని తెలిపారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలో సహాయ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రకాశం, గుంటూరు, కృష్ణా తదితర జిల్లాల కలెక్టర్లనూ అప్రమత్తంగా చేశామన్నారు. ఇప్పటివరకూ 211 సహాయ శిబిరాల్లో సుమారు 9500 మంది ఉన్నారని వెల్లడించారు. వారందరికీ మంచి సదుపాయాలు అందించాలని సీఎం ఆదేశించారు. సౌకర్యాల కల్పనలో ఎలాంటి పొరపాట్లు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు, తిరుపతి సహా తుపాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో కరెంటు సరఫరా వ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని సీఎం ఆదేశించారు. మనుషులు, పశువులు మరణించినట్టు సమాచారం అందితే 48 గంటల్లోగా పరిహారం అందించాలని సీఎం ఆదేశించారు. తుపాను తగ్గిన వెంటనే ఎన్యుమరేషన్ కూడా ప్రారంభం కావాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను వాడుకుని రేషన్ పంపిణీ సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు సీఎం నిర్దేశించారు.

# ఢిల్లీలో అధికార నివాసం ఖాళీ చేయనున్న కేసీఆర్

### 20 ఏళ్ళ అనుబంధానికి తెర



**టీ మీడియా, డిసెంబర్ 5, హైదరాబాద్ :**

తెలంగాణలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వస్తామనుకున్న కారు పార్టీకి ఇక్కడి ఓటర్లు సడెన్ బ్రేకులు వేసారు. తెలంగాణ అర్బన్ ఓటర్లు బీఆర్ఎస్‌ను ఆదరించినా.. రూరల్ ఓటర్లు మాత్రం వార్ వన్ సైడ్ అన్నట్టు ఏక పక్షంగా కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు. దీంతో తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టారు. దీంతో ముఖ్యమంత్రి పదవికి కేసీఆర్ రాజీనామా చేశారు. ఆదివారం సాయంత్రం తన రాజీనామా లేఖను కేసీఆర్ రాజ్ భవన్ కు పంపారు. బీఆర్ఎస్ ఓటమి పాలవ్వడంతో కేసీఆర్ సీఎం పదవికి రాజీనామా చేశారు. కేసీఆర్ రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ 64 సీట్లు సాధించి అధికారాన్ని కైవసం చేసుకుంది. ఇప్పటికే సీఎంగా అధికారంలోంచి దిగిపోయిన తర్వాత సీఎం అధికారిక నివాసం ప్రగతి భవన్‌ను ఖాళీ చేసిన సీఎం కేసీఆర్.. తాజాగా ఢిల్లీలోని తుగ్లక్ రోడ్‌లోని సీఎం అధికారిక నివాసం ఖాళీ చేయనున్నారు. దేశ రాజధాని ఢిల్లోని 23 తుగ్లక్ రోడ్‌లో ఉన్న అధికారిక నివాసంతో ఉన్న కేసీఆర్ 20 ఏళ్ల అనుబంధానికీ తెర పడింది. 2004లో టీఆర్ఎస్ తరుపున కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన కేసీఆర్.. ఆ తర్వాత మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. సెంట్రల్ మినిస్టర్ హోదాలో ఆయనకు తుగ్లక్ రోడ్‌లోని టైప్ 8 క్వార్టర్‌ను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. 2006లో కేసీఆర్.. సెంట్రల్ మినిస్టర్ పదవికి, ఎంపీ పదవికి కేసీఆర్ రాజీనామా చేశారు. ఉపఎన్నికలో మళ్లీ ఎంపీగా గెలిచి అదే నివాసంలో ఉంటూ వస్తున్నారు. 2009లో మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా ఎన్నికై అదే క్వార్టర్‌లో ఉన్నారు. 2014లో కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేశారు. ఇక అన్ని రాష్ట్రాల సీఎంలకు కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో అధికారిక నివాసాలు కేటాయిస్తుంది. ఇందులో భాగంగా అదే నివాసాన్ని కేసీఆర్‌కు కేటాయించింది. అదే సమయంలో నిజామాబాద్ ఎంపీగా గెలుపొందిన కేసీఆర్ కుమార్తె కవిత కూడా అదే ఇల్లును తన అధికారిక నివాసంగా ఎంచుకున్నారు. అలా ఆ క్వార్టర్ ముఖ్యమంత్రికి, ఎంపీ కవితకు.. అధికారిక నివాసంగా మారింది. 2018లో కేసీఆర్ రెండో దఫా ముఖ్యమంత్రి అయ్యాక అదే నివాసాన్ని కొనసాగించారు. ప్రస్తుత ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఓటమి పాలైయింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవికి కేసీఆర్ రాజీనామా చేసారు. ఇప్పటికే ప్రగతి భవన్‌ను ఖాళీ చేసిన కేసీఆర్.. ఢిల్లీలోని ప్రభుత్వ నివాసాన్ని ఖాళీ చేస్తామని అధికారులకు సమాచారం అందజేశారు. అందుకు రెండుమూడు రోజులు సమయం కావాలని అధికారులకు బీఆర్ఎస్ వర్గాలు ఇప్పటికే నివేదించినట్లు తెలిసింది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆరు నెలల గడువు ఇచ్చి ఆ తర్వాత సమస్యలపై పోరాడదమని చెప్పుకొచ్చారు. కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రిగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజైన జూన్ 2 2014న ప్రమాణ స్వీకారం చేసారు. ఆ తర్వాత 2018లో రెండోసారి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఇక మూడోసారి ముఖ్యమంత్రి కావాలనుకున్న సీఎం కేసీఆర్‌ను గద్దె దించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 38.08 శాతం ఓట్లు వచ్చాయి. 39 సీట్లు గెలిచారు. స్వయంగా కేసీఆర్ కామారెడ్డిలో ఓటమి పాలు కావడం విశేషం. అదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ సీఎం అభ్యర్థి రేవంత్ రెడ్డి కూడా ఓటమి పాలైయ్యారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39.89 శాతం ఓట్లు పోలైయ్యాయి. అటు బీజేపీకి 13.91 శాతం ఓట్లు వచ్చాయి. అటు బీఎస్పీకి 1.18 శాతం ఓట్లు వచ్చాయి.

## ఖలిస్థాన్ ఉగ్రవాది

# పాకిస్థాన్‌లో మృతి




**టీ మీడియా, డిసెంబర్ 5, న్యూఢిల్లీ :**

జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలే మేనల్లుడు, ఖలిస్థాన్ ఉగ్రవాది లఖ్‌బీర్ సింగ్ రోడే డిసెంబర్ 2న పాకిస్థాన్‌లో మరణించారు. లఖ్‌బీర్ గుండెపోటుతో మరణించినట్లు నిఘా వర్గాలు మంగళవారం తెలిపాయి. భింద్రన్‌వాలే మరణించిన అనంతరం లఖ్‌బీర్ సింగ్ పాకిస్థాన్ పారిపోయాడు. నిషేధిత సంస్థ ఖలిస్తాన్ జిందాబాద్ ఫోర్స్ అధ్యక్షుడు అయిన లఖ్‌బీర్ సింగ్ భారత్‌లో తీవ్రవాద కార్యకలాపాలలో పాల్గనడంతో భారత ప్రభుత్వం అతనిని గతంలోనే ఉగ్రవాదిగా ప్రకటించింది. లఖ్‌బీర్ మరణాన్ని భారత్‌లో ఉంటున్న అతడి సోదరుడు జస్‌బీర్ సింగ్ ధ్రువీకరించాడు. కెనడాలో ఉంటున్న లఖ్‌బీర్ కుమారుడి నుండి తనకు ఈ సమాచారం అందిందని పేర్కొన్నాడు. పాక్‌లోనే అతడి అంత్యక్రియలను పూర్తిచేసినట్లు వెల్లడించాడు. లఖ్‌బీర్ సింగ్ పంజాబ్‌కు డ్రగ్స్, ఆయుధాలు, పేలుడు పదార్థాలు పంపుతున్నాడని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని పలువురు ప్రముఖ వ్యక్తులను హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు పేర్కొన్నాయి. 20 కేజీల ఆర్‌డిఎక్స్ పేలుడు పదార్థాలను కలిగి ఉన్న లఖ్‌భీర్‌ను నేపాల్‌లో అరెస్ట్ చేసింది. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అక్టోబర్‌లో పంజబాబ్‌లోని మోగాలో లఖ్‌బీర్ ఆస్తులను జప్తు చేసింది. 2021, 2023 మధ్య ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గన్నందుకు లఖ్‌బీర్‌పై ఆరు ఉగ్రవాద కేసులకు సంబంధించి ఈ దాడులు జరిపినట్లు ఎన్ఐఎ వెల్లడించింది. ఈ ఏడాది మేలో ఖలిస్థానీ కమాండో ఫోర్స్ అధినేత పరంజీత్ సింగ్ పన్వార్‌ను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు లాహోర్‌లో కాల్చిచంపారు.

# బీజేపీ అగ్ర నేతలు అబద్దాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించారు

### రాజస్థాన్ మాజీ సిఎం అశోక్ గెహ్లాట్





**టీ మీడియా, డిసెంబర్ 5, జైపూర్:**

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అగ్రనేతలు అబద్ధాలు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఆరోపించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయినా ఓట్ల శాతం ఏమీ తగ్గలేదని ఆయన చెప్పారు. తాము ఎన్నికల ప్రచారంలో స్థానిక సమస్యలపైన, అభివృద్ధిపైన మాట్లాడితే బీజేపీ బడా నేతలు మాత్రం అబ్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడంపైనే ఎక్కువ దృష్టి సారించారని అన్నారు. మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమిపై తాము త్వరలోనే ఆలిండియా కాంగ్రెస్ కమిటీలో విశ్లేషణ చేస్తామని, ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుని తప్పులను సరిదిద్దుకుంటామని గెహ్లాట్ చెప్పారు. కాగా ఇటీవల వెలువడిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. దీనిపై మీడియా పలుకరించగా గెహ్లాట్ పైవిధంగా స్పందించారు.


## మిజోరం సీఎంగా

# లాల్దుహోమా 8న ప్రమాణస్వీకారం



**టీ మీడియా, డిసెంబర్ 5, ఐజ్వాల్ :**

జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ అధినేత లాల్దుహోమా మిజోరం ముఖ్యమంత్రిగా ఈ నెల 8వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నారు. లాల్దుహోమా ప్రమాణస్వీకార కార్యక్ర మానికి ఏర్పాట్లు కొనసాగు తున్నాయి. తాజాగా జరిగిన మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో 40 స్థానాలకు గానూ 27 నియోజక వర్గాల్లో జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ గెలుపొంది, సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది. ఇక ఇవాళ రాత్రి 8 గంటలకు జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ తరపున ఎన్నికైన ఎమ్మెల్యేలు.. లాల్దుహోమా నివాసంలో సమావేశం కానున్నారు. 74 ఏండ్ల వయసున్న లాల్దుహోమా.. ఐపీఎస్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. పదవీ విరమణ అనంతరం ఆయన రాజకీయాల వైపు మొగ్గు చూపారు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. గోవా, ఢిల్లీలో ఆయన ఐపీఎస్‌గా పని చేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సెక్యూరిటీ ఇంచార్జి ఆఫీసర్‌గా కూడా పని చేశారు లాల్దుహోమా. అదే సమయంలో రాజకీయాలకు ఆకర్షితుడైన లాల్దుహోమా తన ఐపీఎస్ పదవికి రాజీనామా చేశారు. 1984లో లోక్‌సభకు ఎన్నికయ్యారు.




## కృష్ణా జలాల వివాదం.. కీలక సమావేశం వాయిదా

**టీ మీడియా, డిసెంబర్ 5, అమరావతి :**
కృష్ణా జలాల వివాదంపై నేడు నిర్వహించనున్న కీలక సమావేశాన్ని కేంద్ర జల్‌శక్తి వాయిదా వేసింది. మిచౌంగ్ తీవ్ర తుపాను కారణంగానే ఈ భేటీ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్వహణపై తెలంగాణ, ఏపీ సీఎస్‌లతో పాటు కృష్ణా నదీయాజమాన్యం బోర్డు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం ఈ సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఢిల్లీ నుంచి కేంద్ర జలశక్తి కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ నేతృత్వంలో ఈ సమావేశం ఉంటుందని తొలుత ప్రకటించింది. అయితే తెలుగు రాష్ట్రాలను మిచౌంగ్ తుపాను కుదిపేస్తుండడంతో అధికార యంత్రాంగం మొత్తం సహాయక చర్యల్లో తలమునకలైంది. ఈ పరిస్థితుల్లో సమావేశం నిర్వహించడం సబబు కాదని భావించిన కేంద్ర జల్‌శక్తి వాయిదా నిర్ణయం తీసుకుంది. ఈ నెల 8వ తేదీన సమావేశం నిర్వహించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

## ప్రజలు మార్పు కోరుకుంటున్నారంటే ఆందోళన చెందాల్సింది బీజేపీనే

- **యూపీ మాజీ సిఎం అఖిలేష్ యాదవ్**

**టీ మీడియా, డిసెంబర్ 5, లక్నో:**




ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 'ఇండియా' కూటమిని మరింత బలోపేతం చేస్తాయని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ అన్నారు. మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచినందున ఐక్యంగా బీజేపీని ఓడించాలనే కసి ప్రతిపక్ష పార్టీల్లో మరింత పెరుగుతుందని చెప్పారు. దేశ ప్రజలు బీజేపీని తుదముట్టించాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను బట్టి ప్రజలు మార్పును కోరుకుంటున్నారనే విషయం స్పష్టమైందని, ఒక్క మధ్యప్రదేశ్‌లో తప్ప అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారిపోయాయని అఖిలేష్ అన్నారు. కాబట్టి ఈ ఫలితాలను చూసి ఆందోళన చెందాల్సింది బీజేపీనే అని చెప్పారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రజలు కేంద్రంలో కూడా ప్రభుత్వాన్ని మార్చబోతున్నారని జోష్యం చెప్పారు. అధికార బీజేపీపై జనం ఆగ్రహంతో ఉన్నారని విమర్శించారు.

## టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ పదవికి రాజీనామా

**టీ మీడియా, డిసెంబర్ 5, సంగారెడ్డి :**



తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి మంగళవారం చింతా ప్రభాకర్ రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పంపారు. సెప్టెంబర్ 28, 2022 న చింతా ప్రభాకర్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. తాజాగా సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్ గెలిచిన విషయం తెలిసిందే. కాగా, నిన్న రాష్ట్రంలోని పలు కార్పొరేషన్ల చైర్మన్లు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పంపారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో పనిచేస్తామని ప్రకటించారు.




## బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

- **తహసిల్దార్ జనార్దన్ శెట్టి**

**టీ మీడియా, డిసెంబర్ 5, మహానంది:**
బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్చించాలని మహానంది తాహాసిల్దార్ జనార్దన్ శెట్టి ఆదేశించారు. మంగళవారం మహానంది మండలంలోని తిమ్మాపురం,గాజులపల్లె గ్రామాల్లోని ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అధికారులు,ప్రధానోపాధ్యాయులు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, వాలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ జనార్దన్ శెట్టి మాట్లాడుతూ పాఠశాలల్లో వంద శాతం గ్రాస్ ఎన్రోల్మెంట్ రిజిస్టర్ ఉండేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి ఏడాది చదువుతూ మధ్యలో బడి మానేసే విద్యార్థులను, అసలు పాఠశాలల్లో చేరని వారిని, స్థానిక వలంటీర్లు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌ల సహకారంతో గుర్తించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివ నాగజ్యోతి, ఎంఈఓలు రామసుబ్బయ్య, లింగన్న, ప్రధానోపాధ్యాయురాలు రవణమ్మ, లక్ష్మణరావు,వీఆర్వో వెంకటరాముడు, పంచాయతీ కార్యదర్శులు ఇర్ఫాన్, శ్రీనివాసులు, సచివాల సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



## మొక్కు చెల్లించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త

**టీ మీడియా, డిసెంబర్ 5, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలో వనపర్తి పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మొక్కు చెల్లించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మన్యం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ వనపర్తి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు పాల్గొన్నారు.వనపర్తి పట్టణంలో 7 వ వార్డు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మన్యం వనపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తూడి మెగా రెడ్డి విజయం సాధిస్తే 108 కొబ్బరికాయలు చెల్లిస్తానని మొక్కుకోవడం జరిగింది. కావున తూడి మెగా రెడ్డి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిచిన సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మన్యం పీర్లగుట్ట ఆంజనేయ స్వామి టెంపుల్లో పూజలు నిర్వహించి108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాము, కాంతు కుమార్, మహేష్, కార్తీక్, రవి, మన్నెంకొండ, వెంకటేష్, ఏర్పుల రాములు, వెంకటేష్, శివ, రాఘవేంద్ర, లక్ష్మి కాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

# నష్టాన్ని మిగిల్చిన వాన...

- **వరి నూర్పిడి చేసిన రైతుల్లో ఆందోళన**

**టీ మీడియా, డిసెంబర్ 5,చాపాడు (కడప) :**



ఆరు కాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో మిచౌంగ్ తుఫాన్ రూపంలో వర్షం రావడంతో పంటలు నేలకొరుగుతున్నాయి. మండల పరిధిలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి, ఈదురు గాలులకు వరి పంట చాలా వరకు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతున్నది. మంగళవారం ఉదయం వరి నూర్పిడి చేస్తున్న రైతులు తమ ఆవేదనను ప్రజాశక్తితో చెప్పుకున్నారు.మండల వ్యాప్తంగా కెసి, కుందూ, పెన్నా పరిధిలో 4 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. అయితే పెన్నా, కుందూ పరివాహక గ్రామాలలో సాగు చేసిన వరి పంట వెయ్యి ఎకరాల వరకు నూర్పిడి చేశారు. నూర్పిడి చేసిన వరి ధాన్యం కాపాడుకునే ప్రయత్నం లో రైతులు నిమగ్నమయ్యారు. రోడ్లు, సురక్షిత ప్రాంతంలో ప్లాస్టిక్ పట్టాలను కప్పి వరి ధాన్యం కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయ్యవారిపల్లి, తిమ్మాయిపల్లి ,రాజువారి పేట, పల్లవోలు ,సీతారామపురం, కుచ్చు పాప, రామసుబ్బమ్మ కొట్టాలు, వెదురూరు గ్రామాల పరిధిలో వరి పంట నూర్పిడి దశలో ఉన్నది. ఖాదర్ పల్లె, సోమాపురం, అయ్యవారిపల్లి, రామదాసు పురం, తిమ్మాయిపల్లి గ్రామాల వద్ద వరి పంట అధికంగా నేలకొరిగింది .వరి ధాన్యం వర్షపునీటిలో తడిస్తే మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. 3 వేల ఎకరాలలో పంట నూర్పిడి దశలో ఉన్నది. పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో దెబ్బతింటుంటే ఏమీ చేయలేని పరిస్థితులలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. వర్షంలోనే వరి కోత యంత్రాల ద్వారా నూర్పిడి పనులు చేపడుతున్నారు. ఎకరా సాగుకు రూ. 30 వేల వరకు ఖర్చులు అయ్యాయని ప్రస్తుతం వర్షానికి ధాన్యం దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం తగ్గుముఖం పట్టకపోతే పంట పూర్తిగా దెబ్బతింటే ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 32 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తున్న సమయంలో వర్షాలతో పంట దెబ్బతినడంతో నష్టాలు తప్పవని రైతులు కంటతడిపెడుతున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం అధిక వర్షాలతో వరి రైతులు ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే.

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో సాగు చాలా వరకు తగ్గినది. ఈ పరిస్థితులలో కూడా పంట చేతికి వచ్చిన దశలో వర్షం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు ఆర్ బి కే ల పరిధిలో ఉన్న తమ సిబ్బంది కలిసి దెబ్బతింటున్న పంటల వివరాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న పంటలు నమోదుకు అవకాశం ఇచ్చి నష్ట పరిహారం అందించాలని రైతన్నలు కోరుతున్నారు.

## ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురు

**టీ మీడియా, డిసెంబర్ 5,అమరావతి:**



ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురైంది. ఫీజు నియంత్రణ మండలి ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజులు ఖరారు చేసిన ప్రక్రియను ధర్మాసనం తోసిపుచ్చింది. ఇంజనీరింగ్ కళాశాలల ఖర్చులలో భాగంగా కమిషన్ విధించిన పరిమితులు చెల్లవని హైకోర్టు స్పష్టం చేసింది. కమిషన్ కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారాన్ని తగ్గించడం కోసమే ఇలాంటి చట్ట వ్యతిరేక ప్రక్రియను చేసిందని న్యాయస్థానం పేర్కొంది. కమిషన్ చట్ట ప్రకారంగా తిరిగి ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజులు ఖరారు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాల తరపున న్యాయవాది మతుకుమిల్లి శ్రీవిజయ్ వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, రెగ్యులేటరీ కమిషన్ తరపున సుదేశ్ ఆనంద్ వాదనలు వినిపించారు.

# రేవంత్ రెడ్డి ప్రొఫైల్

**టి మీడియా, డిసెంబర్ 5, కొడంగల్ :**



1969 నవంబరు 8న పుట్టిన రేవంత్ రెడ్డినాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి గ్రామంలో పుట్టిన రేవంత్.2006లో మిడ్జిల్ మండలం జడ్పీటీసి సభ్యుడుగా విజయం.2007లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగాస్వాతంత్ర్యంగాఎన్నిక.2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం నుండి కొడంగల్ ఎమ్మెల్యేగా గెలుపు. 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్.2014-17 మధ్య వర్కింగ్ ప్రెసిడెంట్.2017 అక్టోబరులో టిడిపికి రాజీనామా.2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిక.2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్.2018 డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుండి పోటీ చేసి ఓటమి.2019 మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో విజయం2021లో జూన్ 26న పీసీసీ అధ్యక్ష్యుడిగా రేవంత్ 2021 జూలై 7న టీపీసీసీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం.

## దళిత మహిళ పోరాటాన్ని ఉధృతం చేస్తాం

- **కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి**

**టీ మీడియా, డిసెంబర్ 5, వనపర్తి బ్యూరో :**




వనపర్తి జిల్లా, శ్రీరంగాపూర్ మండలం, వెంకటాపూరం గ్రామానికి చెందిన దళిత మహిళ సైదమ్మ భర్త శాంతన్న ట్రాక్టర్ కి వాయిదాలు ఈఎంఐ లు కట్టడంలో ఇబ్బందులు రావడంతో అదే గ్రామానికి చెందిన బుక్క ఆనంద్ (మున్నూరు కాపు) తండ్రి సుదర్శన్ కి ఒక సంవత్సరానికి కిరాయికి ఇచ్చారు. గడువు ముగిసిన తర్వాత తన ట్రాక్టర్ ను తెచ్చుకుని ఇంటి దగ్గర పెట్టుకున్న 12 రోజుల అనంతరం 2023, 16 మార్చి న బుక్క ఆనంద్, బుక్క సునీత, బుక్క శంకర్, సాయి, అరుణమ్మ లు ఎవరూ లేని సమయంలో సైదమ్మ ను కులం పేరుతో దూషిస్తూ ఆ ఐదుగురు సైదమ్మ కాళ్లు చేతులు పట్టుకొని తన్నుతూ కుల ఆహకారంతో నిన్ను పెట్రోల్ పోసి చంపినా ఎవ్వరు అడగరని, దాడి చేసి బట్టలు చింపివేసి ట్రాక్టర్ ను బలవంతంగా తీసుకపోయారు. ఈ విషయంలో శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్ లో సైదమ్మ ఫిర్యాదు చేయడానికి పోతే శ్రీరంగాపూర్ పోలీస్ ఎస్.ఎచ్.ఓ పట్టించుకోలేదు. పైగా అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ విష్ణు నీపైననే కేసు నమోదు చేసి బొక్కల తోస్తామని బెదిరించాడు. బాధిత మహిళ ను కులం పేరుతో దూషిస్తూ అవమానపరిచాడు. న్యాయం చేయాల్సిన పోలీసులు అన్యాయంగా దళిత మహిళను అవమానపరచారు. ఈ విషయంలో జిల్లా ఎస్పి ఆదేశాలను సైతం తుంగలో తొక్కిన పోలీసులు తాపిగా నెల రోజుల తర్వాత ట్రాక్టర్ ఊసే లేకుండా నిందితులను కాపాడుతూ మామూలు సెక్షన్ లతో ఎఫ్.ఐ.ఆర్ చేశారు. అందులో బుక్క శంకర్, సాయి, అరుణమ్మ లను తప్పిస్తూ కేవలం ముగ్గిరి పైనే కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. ట్రాక్టర్ ను ఎత్తుకపోయిన కేసు చేయకుండా నిందితులతో కుమ్మక్కైన స్థానిక పోలీసుల మీద చర్యలు తీసుకుని తన ట్రాక్టర్ ను తనకు అప్పగించి న్యాయం చేయాలని వనపర్తి డి.ఎస్.పి ని పలుమార్లు కలిసిన లాభం లేకపోయింది. పైగా డిఎస్పి దళిత బాధితురాలి గ్రామాన్ని సందర్శించకుండనే చార్జ్ సీట్ వేశారు. విధిలేని పరిస్థితులలో మళ్లీ జిల్లా ఎస్.పి, జిల్లా కలెక్టర్, రాష్ట్ర డి.జి.పి లను కలిసి వేడుకున్నప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా దళిత మహిళకు న్యాయం జరగలేదు. దీనిని బట్టి ఒక దళిత మహిళ ట్రాక్టర్ యజమాని గా ఉండడాన్ని అగ్రకుల నిందితులే కాదు అధికారులు కూడా సహించలేక పోయారని అర్థమవుతున్నది. కావున ఈ విషయాలను ప్రజలందరి దృష్టికి తీసుకు వెళ్లడానికి కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను అక్టోబర్ 3న ప్రారంభించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఒక దళిత మహిళ ట్రాక్టర్ పోయి 6 నెలలు అవుతున్నా ట్రాక్టర్ ఆచూకీ కనిపెట్టలేకపోవడంలో ఉన్న పోలీసుల మతలబు ఎంటోనని పోలీస్ ఉన్నత అధికారుల ఆలోచించాలి. పోరాడి సాధించుకున్న తెలంగాణలో పోరాటా లను విస్మరించడం ఆందోళనకరం. ఇది సైదమ్మ కు మాత్రమే కాదు, యావత్తు తెలంగాణ ప్రజలను ఆందోళనలకు గురి చేయడమేగా పేర్కొన్నారు. కనుక ఇప్పటికైనా అధికారులు మీ బాధ్యతను గుర్తించి వెంటనే సైదమ్మ ట్రాక్టర్ ను సైదమ్మ కు అప్పజెప్పాలని, బుక్క ఆనంద్ కుటుంబ సభ్యులను శిక్షించాలని లేనిచో ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలియజేశారు. 64వ రోజు దీక్ష. ముందుగా దీక్ష శిబిరాన్ని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గురుమిల్ల రాజులిప్రారంభించి మాట్లాడారు.సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గన్నారపు సరోజన, కుల అసమనతల నిర్మూలన పోరాట సమితి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే చక్రవర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవింద్, అనుమకొండ జిల్లా కన్వీనర్ తంపుల మొగిలి, నారాయణపేట జిల్లా కన్వీనర్స్ ఎస్ లక్ష్మయ్య, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఎర్ర మోహనకృష్ణ బాధితులు సైదమ్మ, శాంతన్న, బరిగేల సరూప తదితరులు పాల్గొన్నారు.

## కవిత్వం



**గంగవరం రామకృష్ణారెడ్డి**

తూడి తూడి అంటూ వెయ్యి నోళ్లతో అరిసె అది మేఘమై కురిసే. ఇరునుటత్తోబై ఊళ్ళుతడిసే. ఖిల్లలోని వాకిళ్లు, పేట కాడి కోటలు, రేవల్లేవాగుల్లు, పెబ్బేరు సంతంత చిత్తడై , శ్రీ రంగ రంగ అంటూ, మందడంత ముద్దయి, వనపర్తి ఒక్కటై తూడి తూడి అంటూ అరిసె వాడే మేఘమై కురిసే.



## పేద విద్యార్థికి మేఘన్న ఆర్థిక సాయం

**టీ మీడియా, డిసెంబర్ 5, పెబ్బేరు:**
పెబ్బేరు పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన బి.మహేశ్వరి బీఎస్సీ నర్సింగ్ చదివేందుకు అర్హత సాధించింది. మహేశ్వరి కుటుంబం పేదవారు కావడంతో విషయం స్థానిక కార్యకర్తల ద్వారా తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తనవంతుగా ఆ విద్యార్థినికి రూ. 15వేలు మేఘన్న అభయహస్తం కింద ఆర్థిక సాయం అందజేశారు. ఇట్టి నగదును మంగళవారం జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కార్పాకుల వెంకట రాములు, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు గంధం రాజశేఖర్, టౌన్ ఉపాధ్యక్షుడు గంధం సునీల్, జగదీశ్వర్ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ రాములు, వినయ్, పాండు, అశోక్, సత్యం, ఆర్కేరాముడు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రభావంతో నష్టపోయినా రైతాంగానికి ప్రభుత్వం ఆదుకోవాలి

- **సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం**

**టీ మీడియా, డిసెంబర్ 5, చింతూరు :**
మ్యుచాంగ్ తుఫాను కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో దెబ్బతిన్న అన్ని రకాల పంటలకు సర్వేలు నిర్వహించి బాధితంగాలన్నిటిని ప్రభుత్వం ఆదుకోవాలని నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టించి అప్పులు చేసి వరి నువ్వు, పత్తి పంటలను వేయడం జరిగిందని కోతకు వచ్చి నా వరి పైరు తుఫాను కారణంగా సర్వనాశనం అయిపోయిందని రైతుల కు కన్నీరే మిగిలింది అన్నారు. గత నెలలో కూడా వచ్చిన తుఫాను కారణంగా అనేక రకాల పంటలు దెబ్బతిన్నాయని రైతుల కు తీరని నష్టం వాటిలిందన్నారు. సకాలంలో వర్షాలు పడక వర్షాభావ పరిస్థితుల్లోనూ పంటలు దిగుబడి తగ్గిపోవడంతో పాటు అకాల వర్షాలకు రైతులు పంటలు పాడైపోయాయన్నారు. కేవలం ఒక్క చింతూరు మండలంలోని 4114 హెక్టార్ల వరి పంట వేయడం జరిగిందని. 440 హెక్టార్ల పత్తి పంట సాగులో ఉందని. తుఫాను కారణంగా పంటలు పూర్తిగా దెబ్బ తినడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది అన్నారు. చింతూరు డివిజన్ వ్యాప్తంగా దెబ్బతిన్న రైతుల పంటలకు తక్షణమే ఆయా పంటల నష్టంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహించి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈసమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, పల్లపు వెంకట్, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్. చింతూరు మండల కార్యదర్శి సిసం సురేష్ ,కూనవరం మండల కార్యదర్శి పాయ%శీ% సీతారామయ్య. ఎటపాక మండల కార్యదర్శి ఐ వి తదితరులు పాల్గొన్నారు.





## మహానందీశ్వరునికి 35 కిలోల వెండితో రుద్రాక్ష మండపం

**టీ మీడియా, డిసెంబర్ 5, మహానంది:**
ప్రముఖ శైవ క్షేత్రమైన మహానంది పుణ్యక్షేత్రంలో కొలువైన శ్రీ మహానందీశ్వర స్వామి వారికి నంద్యాలకు చెందిన రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ మారం వెంకట సుబ్బయ్య కుటుంబ సభ్యులు 35 కిలోల వెండితో రుద్రాక్ష మండపం చేయించారు. ఈ మేరకు దాతలు సోమవారం రాత్రి మహానంది చేరుకుని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వెండితో చేయించిన మండపాన్ని అందించారు. వేద పండితులు, అర్చకులు స్వాగతం పలికి, రుద్రాక్ష మండపాన్ని శాస్త్రక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను సత్కరించి,స్వామి, అమ్మవార్ల ప్రసాదాలు అందజేశారు.



## చంద్రుడి కక్ష్య నుంచి భూ కక్ష్యలోకి చంద్రయాన్-3 మాడ్యూల్

**టీ మీడియా, డిసెంబర్ 5, న్యూఢిల్లీ :**
చంద్రయాన్?-3 ప్రాజెక్ట్?లో మరో కీలక అడుగు ముందుకు పడింది. చంద్రుని దక్షిణ ధ్రువం పైన ల్యాండ్ అయ్యి ప్రపంచంలో ఏ దేశం సాధించలేని ఘనత సాధించింది. తాజాగా ఇస్రో.. జాబిల్లి వద్దకు పంపిన ప్రొపల్షన్ మాడ్యూల్‌ను విజయవంతంగా చంద్రుడి కక్ష్య నుంచి భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇది ప్రత్యేక ప్రయోగమని ఇస్రో శాస్త్రవేత్తలు? చెప్పారు. చంద్రుడిపై నుంచి నమూనాలు సేకరించే ప్రణాళికలు చేస్తున్నామని.. తాజా ప్రయోగం ఆ మిషన్?కు దోహదపడుతుందని తెలిపారు. నమూనాలను తీసుకొని తిరిగి వచ్చే మిషన్ కోసం వ్యూహాలు రూపొందించేందుకు ప్రొపల్షన్ మాడ్యూల్?లోని అదనపు సమాచారం ఉపయోగపడుతుందని వెల్లడించారు.

## శశికళ అప్పీల్‌ను తిరస్కరించిన మద్రాసు కోర్టు

**టీ మీడియా, డిసెంబర్ 5, చెన్నై:**
తమిళనాడు దివంతగ సీఎం జయలలిత స్నేహితురాలు వీకే శశికళ కు మద్రాసు హైకోర్టులో చుక్కెదురైంది. అన్నాడీఎంకే పార్టీకి తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా తనను కొనసాగించాలని ఆమె పెట్టుకున్న అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. జస్టిస్ ఆర్ సుబ్రమణియన్, ఎన్. సెంథిల్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఆ కేసులో తీర్పును ఇచ్చింది. 2022లో శశికళ దాఖలు చేసిన మూడు అప్పీల్స్‌ను బెంచ్ తిరస్కరించింది. మాజీ సీఎం జయలలిత మృతి తర్వాత 2016, డిసెంబర్ 29వ తేదీన అన్నాడీఎంకే పార్టీ జనరల్ సెక్రటరీగా శశికళను నియమించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఆమెను తొలగించారు. అయితే ఆ పోస్టులో తననే ప్రకటించాలని ఆమె పెట్టుకున్న అభ్యర్థనను కోర్టు కొట్టిపారేసింది.





## మేడ్చల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**టీ మీడియా, డిసెంబర్ 5, మేడ్చల్ :**
మేడ్చల్ జిల్లా కీసరలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం కీసర పరిధిలో వేగంగా దూసుకొచ్చిన ఓ లారీ, ద్వాచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై వెళ్తున్న ఇద్దరు యువకులు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి లారీ డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.మృతి చెందిన యువకులను చేర్యాలకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## పాగాల సంపత్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులు

- అర్పించిన కేటీఆర్

**టీ మీడియా, డిసెంబర్ 5, జనగామ:**
బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి పార్థివదేహానికి మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. సంపత్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సంపత్‌రెడ్డి అకాల మరణం కలిచివేసిందని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. కాగా, సంపత్‌రెడ్డి (55) సోమవారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. హనుమకొండలోని తన నివాసంలో చాయ్ తాగిన కొద్దిసేపటికే గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారుడిగా బీఆర్ఎస్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్య తదితరులు ఉన్నారు.



## క్రీడాకారిణికి చేయూత

- మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని

**టీ మీడియా, డిసెంబర్ 5, మహానంది:**
మహనంది మండలం గోపవరం గ్రామానికి చెందిన చెవుల చిన్న వెంకటరమణ కుమార్తె చెవుల వర్షితకు రూ. 10,000/- రూపాయలు ఆర్థిక సహాయంగా మండల అధ్యక్షులు బుడ్డారెడ్డి యశస్విని మంగళవారం అందజేశారు. బ్యాంకాక్ లో జరిగే క్వీన్స్ కప్ జంప్ రోప్ థాయ్ ల్యాండ్ ఓపెన్ టోర్నమెంట్ పాల్గొననున్న చెవుల వర్షిత తల్లి కి ఆర్థిక సహాయంగా అందజేశారు.



# అగ్గి బరాట రేవంత్ రెడ్డి

## టీపీసీసీ చీఫ్ నుంచి సీఎం వరకు

- ఎన్నో.. ఎన్నెన్నో సంచలనాలు..

**టిమీడియా, డిసెంబర్ 5, హైద్రాబాద్ :**
టీపీసీసీ చీఫ్‌గా అనుముల రేవంత్ రెడ్డి పేరును జూన్, 2021లో హైకమాండ్ అనౌన్స్ చేసిన సందర్భంలో కాంగ్రెస్‌పార్టీలో జరిగిన హైడ్రామా ఇప్పటికీ తెలుగు ప్రజలు మదినుంచి చెరిగిపోలేదు. సీనియర్స్ అంతా రేవంత్ టీపీసీసీ చీఫ్‌గా వద్దని వ్యతిరేకించినా హైకమాండ్ వినలేదు. అక్కడ్నుంచే కాంగ్రెస్‌లో గ్రూప్ రాజకీయాలు మరింత పదునెక్కాయి. ఒరిజినల్ కాంగ్రెస్.. డూప్లికేట్ కాంగ్రెస్ అంటూ రెండు గ్రూపులు తెరపైకొచ్చాయి. టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని ఓ సెక్షన్ ఆఫ్ కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించేవారు. అడ్డుకునేవారు. పార్టీ మీటింగ్‌లకు పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్ పిలిచినా కొందరు వచ్చేవారు కాదు. ఇంకొందరు గాంధీభవన్ గడప తొక్కమని శపథాలు కూడా చేశారు. మరికొందరు బహిరంగంగానే విమర్శలతో విరుచుకుపడిన సందర్భాలు కోకొల్లలు. అయినా ఎక్కడా వెనక్కి తగ్గలేదు. అసమ్మతులకు, వర్గాలకు నిలయమైన కాంగ్రెస్ పార్టీకి అధ్యక్ష బాధ్యతలు వహిస్తూ, అందరినీ కలుపుకు పోయే ప్రయత్నాలు చేసిన రేవంత్, అటు అధిష్టానానికి కూడా చేరువయ్యారు.అసలు ఈరేంజ్‌లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఏడాది కిందట ఏ రాజకీయ పార్టీ.. ఏ లీడరూ.. అంతెందుకు కాంగ్రెస్ నేతలే ఊహించలేదు. ఇక తెలంగాణలో కాంగ్రెస్ శకం ముగిసిందని ఎన్ని జాకీలు పెట్టినా లేవదంటూ ఎద్దేవా చేశారు ప్రత్యర్థులు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ అన్నట్టుగా తెలంగాణ రాజకీయాలు మారిపోయాయి. ఉపఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ బీజేపీ అద్భుతమైన ఫలితాలు రాబట్టడంతో ఈసారి గులాబీ దండుకు గట్టిపోటీ ఇస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. అయినా టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి ఏ దశలోనూ నిరుత్సాహ పడలేదు. ఓవైపు సొంత పార్టీ నుంచి తగులుతున్న రాళ్లు..మరోవైపు పార్టీని బలోపేతం చేసేందుకు ఎదురయ్యే అడ్డంకులు ఇలా ప్రతి సమస్యను సమయస్ఫూర్తితో హ్యాండిల్ చేశారంటారు విశ్లేషకులు.

ఓ రకంగా కర్నాటక ఫలితాలు కాంగ్రెస్‌కు డబుల్ బూస్టప్‌నిచ్చాయని చెప్పొచ్చు. ఇక్కడ బీజేపీ అధ్యక్షుడి మార్పు కూడా కాంగ్రెస్‌కు కలిసొచ్చింది. అటు హైకమాండ్ కూడా కర్ణాటక తర్వాత కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ ఎన్నికలపై ఫోకస్ పెంచింది. ఆపార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ విస్తృతంగా రాష్ట్రంలో పర్యటించారు. ఈ సమయంలో రేవంత్ వారి వెంట ఉండి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కూడా పాల్గొన్న రేవంత్ రెడ్డి ఆయనకు సన్నిహితంగా ఉండేందుకు ప్రయత్నించారు. మరోవైపు పార్టీలో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ సీనియర్ నేతల నుంచి విమర్శలు వస్తున్నా తనదైన శైలిలో పని చేసుకుపోతున్నారన్న పేరు తెచ్చుకున్నారు రేవంత్ రెడ్డి.



అలా ఒక్కో సమస్యను అధిగమిస్తూ.. హైకమాండ్‌కు మరింత దగ్గరై.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి కాగల వ్యక్తి అన్న స్థాయికి పార్టీలో రేవంత్ ప్రాబల్యం పెరిగింది. పార్టీలోకి వచ్చిన కొత్తలోనే తాను కూడా ముఖ్యమంత్రి అభ్యర్థినేనంటూ వ్యాఖ్యలు చేసి సంచలనం సృష్టించిన రేవంత్, ఎన్నికల ప్రచారం సమయంలో కూడా తన మనోభావాన్ని ప్రజల ముందుంచారు.

ఈ ఎన్నికల ప్రచారంలో కూడా కొంత సెంటిమెంట్‌ను రగిలించి చేసిన రేవంత్‌రెడ్డి స్పీచ్‌లు కూడా ప్రజల్లో తనపై అటెన్షన్ను పెంచింది. అలాగే సొంతపార్టీలోని అగ్రనేతలు రేవంత్ టార్గెట్‌గా కామెంట్స్ చేయడం.. ఇటు ప్రత్యర్థులు కూడా టీపీసీసీ చీఫ్‌నే లక్ష్యంగా చేసుకోవడంతో రాజకీయంగా రేవంత్‌పై మరింత ఫోకస్ పెంచేలా చేసింది. మీవాడు రాష్ట్రానికి నాయకత్వం వహించేందుకు సహకరించాలి అంటూ ఎన్నికల ప్రచార సభలో రేవంత్ ఇచ్చిన పిలుపు కూడా ప్రజల్లోకి బాగా వెళ్లింది.

తెలంగాణ ఉద్యమం నుంచే కేసీఆర్ పైనా ఆయన కుటుంబం పైనా తీవ్రపదజాలంతో విరుచుకుపడే నేతగా రేవంత్ రెడ్డికి పేరుంది. అసెంబ్లీలో గవర్నర్‌పై కాగితాలు విసిరేయడం లాంటి పనులు చేసినా అప్పట్లో ఆయనకు సమైక్యవాదుల్లో గ్లామర్ సంపాదించి పెట్టింది కేసీఆర్‌పై వ్యతిరేకతే. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా కేసీఆర్ వ్యతిరేకుల జాబితాలో మొదటి పేరు రేవంత్‌దే. కేసీఆర్‌పైనా, ఆయన కుటుంబం సభ్యులపై పరిధులు దాటి రేవంత్ తీవ్ర విమర్శలు చేసిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. తాజా ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ అధిపతికి తానే సరిజోడు అనిపించుకునేందుకు కామారెడ్డిలో కేసీఆర్‌పై స్వయంగా పోటీ చేశారన్నది రాజకీయంగా వినిపించే మాట.

ఇలా కార్యకర్త స్థాయి నుంచి ఒక్కో మెట్టు ఎదుగుతూ కాంగ్రెస్ పార్టీలో టీపీసీసీ చీఫ్ నుంచి ఇప్పుడు చీఫ్ మినిస్టర్ స్థాయికి ఎదిగేలా రాజకీయాల్లో వందకు వందశాతం సక్సెస్ అయ్యారు రేవంత్. అయితే రేవంత్‌రెడ్డికి సీఎం పోస్టు ఇస్తే ఏం అనుభవం ఉందన్న విమర్శలకు రేవంత్ తనదైనశైలిలో ఆన్సర్ ఇస్తున్నారు. టీవీ9 ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పొలిటికల్ కాన్‌క్లేవ్‌లో సీఎంగా మీ అనుభవం ఏంటి అన్న టీవీ9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్ ప్రశ్నకు రేవంత్ రెడ్డి తనదైన స్టైల్లో ఆన్సరిచ్చారు.

ఇలా పార్టీలో ఉన్న సమస్యలన్నింటిని ఒకొక్కటిగా పరిష్కరించారు. అలిగిన నాయకుల్ని, అసంతృప్తితో ఉన్న సీనియర్లను కలిసి ఏక తాటిపైకి తెచ్చారు. అందర్నీ ఏకం చేసి.. తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగిరేలా చేశారు. కానీ ఇల్లు అలకగానే పండుగ కాదు.. అధికారంలోకి రాగానే గెలిచినట్టు కాదు. రేవంత్ రెడ్డి పదే పదే చెప్పే మాట..

ఇప్పటిదాకా రేవంత్‌రెడ్డి రాజకీయం ఓలెక్కయితే..ఇప్పట్నుంచి మరోలెక్క. సీఎంగా ఎలాంటి మార్క్ చూపిస్తారన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఆరు గ్యారంటీలతో రాష్ట్రం దివాళా తీసే పరిస్థితికి కాంగ్రెస్ తీసుకొస్తుందన్న విమర్శలకు దీటుగా పాలన సాగించాలి. మరి చూడాలి..పార్టీని గెలిచి%ొ%రాష్ట్రాన్ని గెలిచిన రేవంత్‌రెడ్డి..పాలనలోనూ గెలిచి తెలంగాణ సమాజం నుంచి శెభాష్ అనిపించుకుంటారా..లేదా అన్నది.. వేచి చూడాల్సిందే..

# అధిష్టానంకు రేవంత్ కృతజ్ఞతలు

- పార్టీ సైనికులుకు ధన్యవాదములు

**టి మీడియా, డిసెంబర్ 5,హైదరాబాద్ :**
తెలంగాణ సీఎల్పీ నేతగా తనను ఎంపిక చేసినందుకు కాంగ్రెస్ అధిష్టానానికి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావ్ ఠాక్రే తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అనునిత్యం వెన్నంటి ఉంటూ తనకు సహకారం అందించిన పార్టీ సైనికులకు రుణపడి ఉంటానని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విటర్)లో పోస్టు చేశారు.
సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసిన నేపథ్యంలో ఆయన ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ రేవంత్‌రెడ్డిని సీఎంగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు చెప్పిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానం రేవంత్‌ను సీఎల్పీ నేతగా ఎంపిక చేసినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ దిల్లీలో ప్రకటించారు. డిసెంబర్ 7న ఆయన ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు.




## ఓటమి జీర్ణించుకోలేక ఈవీఎంలను నిందిస్తున్న కాంగ్రెస్

- బీజేపీ

**టీ మీడియా, డిసెంబర్ 5, భోపాల్ :**
మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ఘోర పరాజయం అనంతరం ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ దిగ్విజయ్ సింగ్ ఈవీఎంలపై సందేహం వ్యక్తం చేయడం పట్ల బీజేపీ మండిపడింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమితో దిక్కుతోచని స్థితిలో ఆ పార్టీ ఈవీఎంలను నిందిస్తోందని కాషాయ పార్టీ ఎద్దేవా చేసింది. చిప్ ఉన్న ఏ మెషీన్‌ను అయినా హ్యాక్ చేయవచ్చని, 2003 నుంచి తాను ఈవీఎంలతో ఓటింగ్‌ను వ్యతిరేకిస్తున్నానని మధ్యప్రదేశ్ మాజీ సీఎం కూడా అయిన దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. సింగ్ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తోసిపుచ్చారు. ఓటమి ఎదురైన తర్వాతే కాంగ్రెస్ ఈ ఆరోపణలు గుప్పిస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ తెలంగాణలో గతంలో హిమాచల్ ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో విజయం సాధించినప్పుడు ఈవీఎంల గురించి మాట్లాడలేదని అన్నారు. సనాతన ధర్మాన్ని మీరు విమర్శిస్తే కాంగ్రెస్ పరిస్థితి ఇలాగే ఉంటుందని ఆ పార్టీ నేత ప్రమోద్ కృష్ణ సరిగ్గా చెప్పారని గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు. ఇండియా పేరిట ప్రతిపక్షాలు ఏర్పాటు చేసిన ఫ్రంట్ విపక్ష కూటమి కాదని, అది అహంకార కూటమి అని అది కుప్పకూలడం ఖాయమని గిరిరాజ్ సింగ్ స్పష్టం చేశారు. మరోవైపు ఈవీఎంల పనితీరుపై ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ కూడా సందేహాలు వ్యక్తం చేశారు. ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.





## సీఎంగా రేవంత్ ఎన్నిక పై హర్షం వ్యక్తం చేసిన

- కాంగ్రెస్ కార్యకర్తలు

**టీ మీడియా, డిసెంబర్ 5, చిన్నంబావి :**
చిన్నంబావి మండలం లోని గడ్డ బస్వాపూర్ గ్రామం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఎన్నికైన సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణ సంచలు కలుస్తూ సంబరాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజేష్ నాయక్, గ్రామ పార్టీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అడవి పందుల దాడిలో వరి పంట నష్టం

- పంటలను కాపాడుకునేందుకు అన్నదాతల అగచాట్లు

**టీ మీడియా, డిసెంబర్ 5, మహానంది:**
మహానంది మండలం మజరా గ్రామ పంచాయతీ గాజులపల్లె గ్రామ పరిధిలోని బసాపురం గ్రామంలోని అదే గ్రామానికి చెందిన రైతు సయ్యద్ హుస్సేన్సా తన అర్ధ ఎకరా పొలంలో వేసుకున్న వరి పంటను సోమవారం రాత్రి అడవి పందులు దాడి చేయడంతో దెబ్బతిన్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆరుగాలం కష్టపడి సాగుచేసుకున్న వరి పంట చేతికందే సమయంలో అడవి పందులు దాడి చేసి నష్ట పరచడం తమకు తీరని నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అడవి పందుల దాడి నుంచి తమ పంట పొలాలను కాపాడుకోవడానికి రైతులు రాత్రి సమయాల్లో కాపు కాస్తున్నారు. అయినప్పటికీ అడవిపందులు అర్ధరాత్రి గుంపులు గుంపులుగా వచ్చి పంటను ధ్వంసం చేసి పోతున్నాయి.పందులను బెదరకొట్టేందుకు పంటల రక్షణకు రైతులు పాత చీరలను కడుతున్నారు. అయినా అడవి పందులు దాడి చేస్తుండడంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అడవిపందుల బారి నుంచి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేస్తున్నారు.





## పెళ్లి కానుక కింద మేఘన్న ఆర్థిక సాయం

**టీ మీడియా, డిసెంబర్ 5, పెబ్బేరు:**
పెబ్బేరు పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన గడ్డమీది బాలకిష్టి చిన్నమ్మ కుమారుని వివాహానికి పెళ్లి కానుకగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం ఇట్టి నగదును పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కార్వాకుల వెంకటరాములు చేతుల మీదుగా ఆ దంపతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు గంధం సునీల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంధం రాజశేఖర్, జగదీశ్వర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రాముడు, వినయ్, పాండు , అశోక్, రాజు, పాల్గొన్నారు.